అంతర్గత రోడ్లు అధ్వానం

- అవస్థలు పడుతున్న కాలనీ ప్రజలు
- పట్టించుకోని అధికారులు

చెన్నూర్: మున్సిపాలిటీ పరిధిలో 11, 6, 9వ వార్డుల్లో గల గాలికుంట వీధి, పద్మశాలివాడ, ఇందిరానగర్ కాలనీల్లో కనీస రోడ్లు లేక జనం ఇబ్బందులు పడుతున్నారు. మూడు వార్డుల్లో గాలికుంట వీధిలో సుమారు 400 కుటుంబాలు 1600మంది ప్రజలు జీవనం సాగిస్తున్నారు. కాలనీలో మట్టి రోడ్లే దిక్కయ్యాయి. వర్షాకాలం వచ్చిందంటే బురద రోడ్లతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్లు నిర్మించాలని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయిందని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆటోలు రాని పరిస్థితి..

గాలికుంట వీధిలో ఆటోలు రాని పరిస్థితి నెలకొందని కాలనీ ప్రజలు వాపోతున్నారు. గాలికుంట వీధి, ఇందిరానగర్ నుంచి మహంకాళివాడ, కుమ్మరిబొగుడ, చింతకింది వాడ, కొటంవాడ, మారెమ్మ వాడల ప్రజలతో పాటు శివాలయానికి, ఎస్సీవాడలకు వెళ్లే ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. మూడు వార్డుల్లో సుమారు పది వాడల ప్రజలకు ప్రధాన రహదారిగా ఉన్న గాలికుంటవీధి, పద్మశాలివాడ, ఇందిరానగర్‌లో రోడ్ల నిర్మాణానికి అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. పిల్లలను స్కూల్‌కు తీసుకెళ్లేందుకు వర్షాకాలంలో ఆటోలు రావడం లేదని పలువురు మహిళలు వాపోయారు. జిల్లా అధికారులు స్పందించి రోడ్లు నిర్మించాలని కోరుతున్నారు.



చెన్నూర్ గాలికుంట కాలనీలో బురదమయంగా రోడ్డు

బయటకు రాలేని పరిస్థితి..



రోడ్లన్నీ బురదమయంగా మారాయి. రాత్రి బయటికి రావాలంటే భయం వేస్తోంది. బురదలో ఎక్కడ జారిపడి పోతామోనని పిల్లలను కూడా రానివ్వలేం. పిల్లలను బడికి పంపించేందుకు ఆటోలు రాలేని పరిస్థితి ఉంది. ఇందిరానగర్ కాలనీలో పారిశుధ్యం లోపించి ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారని కాలనీ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా అధికారులు స్పందించి రోడ్లు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

\- చిట్యాల సౌందర్య, గాలికుంట వీధి

రోడ్లపై నీరు నిలిచి..



సిమెంట్ రోడ్డు లేకపోవడంతో మట్టి రోడ్లలో నీరు నిలిచి దోమలు వస్తున్నాయి. వర్షాకాలం వచ్చిందంటే గోసైతంది. ఎన్నికలప్పుడు రోడ్డు యేత్తం అంటరు, కానీ ఎలక్షన్లు అయిన తర్వాత మా ముఖం చూసిన వారే లేరు. అధికారులు మా వాడలో సిమెంట్ రోడ్డు నిర్మించాలి.

\- బజ్జూరి రాజక్క, గాలికుంట వీధి

పాఠశాల ద్వారం.. పచ్చని తోరణం



దండేపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల ద్వారం వద్ద ఆహ్లాదంతో ఆహ్వానం

దండేపల్లి: గ్రామీణప్రాంతాల్లో విద్యార్థులు ప్రకృతితో మమేకమై ఆడుతూపాడుతూ విద్యనభ్యసిస్తారు. విశాలమైన మైదానాల్లో, పచ్చని చెట్ల మధ్య స్వచ్ఛమైన సహజ వాయువును పీల్చుకునేలా కొన్ని పాఠశాలలను ఉపాధ్యాయులు, గ్రామస్తులు, అధికారులు తీర్చిదిద్దారు. దండేపల్లి మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల, కస్తూర్బా పాఠశాల, ద్వారక, గుడిరేవు ఉన్నత పాఠశాలల్లో పచ్చని చెట్లు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి.



దండేపల్లి కేజీబీవీ ద్వారం ఇరువైపులా ఆహ్లాదం

క్లుప్తంగా

విద్యార్థులు పట్టుదలతో చదవాలి



విద్యార్థులు, ఉపాధ్యాయులతో డీఈవో

చెన్నూర్‌రూరల్: విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని డీఈవో యాదయ్య అన్నారు. మండలంలోని కిష్టంపేట గ్రామంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో కీశే.కోలకొండ సరోజిని దేవి, వెంకటనరసింహారావుల జ్ఞాపకార్థం వారి కుమారుడు సుబ్బారావు శనివారం 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు బ్యాగులు పంపిణీ చేసే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం డీఈవో మాట్లాడారు. విద్యార్థులు బాగా చదివి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంఈవో రాధాకృష్ణమూర్తి, హెచ్‌ఎం సత్యనారాయణ పాల్గొన్నారు.

భూములకు హద్దులు ఏర్పాటు



హద్దులు నిర్ణయిస్తున్న సర్వేయర్

భీమారం: మండల కేంద్రంలోని శ్రీకోదండ రామాలయానికి చెందిన భూములు సర్వే చేయాలని పలువురు తహసీల్దార్ సదానందంకు విన్నవించగా, ఇన్‌చార్జి సర్వేయర్ అశోక్ కుమార్ బృందం శనివారం సర్వే నంబర్లు 254లో 2.28ఎకరాలు, 248లో 10గుంటలు, 256లో 14గుంటల భూముల్లో సర్వే చేసి దేవాలయం భూములకు హద్దులు నిర్ణయించారు. ఎలాంటి ఘర్షణలు జరగకుండా ఎస్సై శ్వేత ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. సర్వేను శ్రీరాంపూర్ సీఐ వేణుచందర్ పరిశీలించారు.

బీసీ రిజర్వేషన్ బిల్లు ప్రవేశపెట్టాలి



తెలంగాణ తల్లి విగ్రహానికి వినతిపత్రం ఇస్తూ...

పాతమంచిర్యాల: పార్లమెంట్ సమావేశాల్లో బీసీ రిజర్వేషన్ బిల్లు ప్రవేశపెట్టి చట్ట సభల్లో బీసీలకు 50శాతం రిజర్వేషన్లు కల్పించాలని జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు గుమ్ముల శ్రీనివాస్ అన్నారు. జిల్లా కేంద్రంలో శనివారం తెలంగాణ తల్లి విగ్రహానికి వినతిపత్రం ఇచ్చి నిరసన తెలిపారు. కార్యక్రమంలో జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర నాయకులు కర్రె లచ్చన్న, గజెల్లి వెంకటయ్య, జిల్లా కార్యదర్శి భీంసేన్, నాయకులు సతీష్, నాగరాజు పాల్గొన్నారు.

పాఠశాలలో ఎన్నికలు



ఓటు వినియోగించుకుంటున్న విద్యార్థులు

లక్సెట్టిపేట: స్థానిక శ్రీ చైతన్య పాఠశాలలో విద్యార్థులకు శనివారం కేబినెట్ ఎన్నికలు నిర్వహించారు. విద్యార్థులకు ఓట్లు పై అవగాహన కల్పించారు. అనంతరం వారు ఎన్నికల్లో పాల్గొని ఓటు వినియోగించుకున్నారు. ఓటు వేసి నూతన కమిటీని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ అశ్విన్, సిబ్బంది అరవింద్, నాగరాజు, సుధీర్, శైలజ, అనూష, రమేశ్ పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న సీఐ హనోక్

నెన్నెల: సైబర్ నేరాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని బెల్లంపల్లి రూరల్ సీఐ హనోక్ అన్నారు. నెన్నెల కేజీబీవీలో శనివారం విద్యార్థినులకు అవగాహన కల్పించారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. మహిళల భద్రతపై వివరించారు. ఎవరైనా వేధింపులకు గురి చేస్తే 100కు ఫోన్ చేయాలన్నారు. క్రమశిక్షణతో కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను చేరుకోవాలని తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సై ప్రసాద్, ఎస్‌వో కవిత, పోలీసులు ఉన్నారు.

అటవీ ఆంక్షలు తొలగించాలి



మద్దతు తెలుపుతున్న ఎస్‌ఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రామ్ ప్రసాద్

జన్నారం: మండలాన్ని కవ్వాల్ టైగర్ ఫారెస్ట్ పేరుతో అభివృద్ధికి దూరం చేస్తున్నారని 'నవతరం స్టూడెంట్ ఫెడరేషన్(ఎన్ఎస్ఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు నీరటి రామ్‌ప్రసాద్ అన్నారు. అటవీ ఆంక్షలను వెంటనే తొలగించాలని డిమాండ్ చేస్తూ చేస్తున్న రిలే నిరాహార దీక్షలకు మద్దతుగా ఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో శనివారం మండల కేంద్రంలో విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించి మద్దతుగా దీక్షల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో భూమాచారి, బద్రినాయక్, ఎన్ఎస్ఎఫ్ నాయకులు సాయి చరణ్, ఈశ్వర్, ప్రదీప్, విద్యార్థులు పాల్గొన్నారు.

రక్షణ చట్టాలపై అవగాహన



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎస్సై స్వరూప్‌రాజ్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం కర్ణమామిడిలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని శనివారం ఎస్సై స్వరూప్‌రాజ్, పోలీస్ సిబ్బంది సందర్శించారు. పాఠశాలలోని సీసీ కెమెరాల పనితీరును పరిశీలించారు. 9, 10 తరగతుల విద్యార్థులకు రక్షణ చట్టాలపై అవగాహన కల్పించారు. చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ఏమైనా ఇబ్బందులు తలెత్తితే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో కేజీబీవీ ప్రత్యేకాధికారి స్వప్న, ఉపాధ్యాయులు, బ్లూ కోల్ట్స్ సిబ్బంది శ్రీనివాస్, సత్యనారాయణ పాల్గొన్నారు.

ఎడతెరిపి లేని వాన..

దండేపల్లి: మండలంలో శనివారం పొద్దంతా ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాల్లో వర్షం నీళ్లు నిలిచాయి. చెరువులు, కుంటల్లో నీటిమట్టం కొంతమేర పెరిగింది. వరినాట్లు వేసే వారికి వర్షాలు కొంత ఊరటనిచ్చాయి.

వర్షాలకు కూలిన ఇల్లు

చెన్నూర్‌రూరల్: ఇటీవల కురుస్తున్న వర్షాలకు మండలంలోని ఎల్లక్కపేట గ్రామంలో శుక్రవారం రాత్రి కొమ్మెర సతీశ్ ఇల్లు కూలింది. సమయానికి ఇంటిలో ఎవరూ లేకపోవడంతో ఎలాంటి ప్రమాదం జరగలేదు. శనివారం తహసీల్దార్ మల్లికార్జున్, ఆర్ఐ అజీజ్‌లు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు.

తెగిన రోడ్డును పరిశీలించిన అధికారులు



రోడ్డును పరిశీలిస్తున్న అధికారులు

భీమిని: ఇటీవల కురిసిన వర్షానికి భీమిని మండలంలోని రాజారం చెన్నపూర్ గ్రామాల మధ్యలో తెగిన కంకర రోడ్డును, ఖర్జీభీంపూర్ వద్ద కోతకు గురైన కల్వర్ట్‌ను శనివారం పంచాయతీ రాజ్ ఈఈ రాంమోహన్ పరిశీలించారు. వాటి మరమ్మతులకు కావాల్సిన మెటీరియల్ ఎస్టిమేషన్ వివరాలు సేకరించారు. వర్షాలు తగ్గిన వెంటనే మరమ్మతు చేపిస్తామన్నారు. ఈఈ వెంట డీఈ సంతోష్‌కుమార్, ఏఈ రాఘవేంద్ర ఉన్నారు.

కేజీబీవీలో స్పాట్ అడ్మిషన్లు

నస్పూర్: పట్టణ పరిధిలోని కేజీబీవీలో మిగిలిన సీట్లకు ఈ నెల 28న స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు విద్యాలయం స్పెషల్ ఆఫీసర్ మౌనిక శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం ఎంపీసీలో 10సీట్లు, ఆరో తరగతిలో 10సీట్లు ఉన్నట్లు ఆసక్తి కలిగిన వారు స్పాట్ అడ్మిషన్లలో పాల్గొని అడ్మిషన్ పొందవచ్చునని ఆమె సూచించారు.

ఐకేపీ ఏపీఎంగా లలిత కుమారి

జన్నారం: మండల ఐకేపీ ఏపీఎంగా లలిత కుమారి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఏపీఎంగా పనిచేసిన బుచ్చన్న డీఆర్‌డీవో కార్యాలయానికి బదిలీపై వెళ్లగా మందమర్రి ఐకేపీ ఏపీఎంగా విధులు నిర్వహిస్తున్న లలిత కుమారిని జన్నారంకు బదిలీ చేస్తూ డీఆర్‌డీవో కిషన్ ఉత్తర్వులు జారీ చేశారు.

రిజర్వేషన్ల సాధనకు ఉద్యమించాలి

పాతమంచిర్యాల: బీసీలు రిజర్వేషన్ల సాధన కోసం సాహు మహరాజ్ స్ఫూర్తితో ఉద్యమించాలని బీసీ మేధావుల ఫోరం జిల్లా చీఫ్ కో ఆర్డినేటర్ రామోజు కొండయ్య అన్నారు. జిల్లా కేంద్రంలోని సీవీ రామన్ కళాశాలలో శనివారం రిజర్వేషన్స్ డే పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో బీసీ మేధావుల ఫోరం కో ఆర్డినేటర్ కనుకుట్ల మల్లయ్య, విశ్రాంత జిల్లా అదనపు జడ్జి కే.రాజన్న, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

భీమారం మండల ప్రత్యేకాధికారిగా ఛత్రునాయక్

భీమారం: మండల ప్రత్యేకాధికారిగా జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఛత్రునాయక్ నియమితులయ్యారు. మండల పరిషత్ కార్యాలయాన్ని శనివారం ఆయన సందర్శించారు. మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనుల గురించి ఎంపీడీవో మధుసూదన్‌ను అడిగి తెలుసుకున్నారు.

సమస్యలపై సీఎంకు వినతి



సీఎంకు వినతిపత్రం ఇస్తున్న హరీష్‌గౌడ్

నెన్నెల: మండల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ ఆధ్వర్యంలో గొల్లపల్లి మాజీ ఎంపీటీసీ హరీష్‌గౌడ్ హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి వినతిపత్రం ఇచ్చారు. ప్రజలు గత 30సంవత్సరాలుగా సాగు చేస్తున్న భూములను ఫారెస్ట్ అధికారులు అడ్డుకొని తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని తెలిపారు. అర్హులైన రైతులకు పట్టాలు ఇప్పించాలని కోరారు. అటవీ అనుమతులు లేక నిలిచిపోయిన రోడ్డు పనులు ప్రారంభించాలన్నారు. నెన్నెలటీ రోడ్డు నుంచి ఎల్లమ్మ గుడి వెళ్లే మార్గంలో కుమ్మరివాగుపై బ్రిడ్జి నిర్మించాలని సీఎం దృష్టికి తీసుకెళ్లారు. నెన్నెల కుమ్మరివాగు బ్రిడ్జి శిథిలావస్థలో ఉన్నందునా, నూతన బ్రిడ్జి నిర్మాణానికి నిధులు కేటాయించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. నెన్నెల నుంచి ఆవుడం గ్రామానికి డబుల్‌రోడ్డు నిధులు మంజూరు చేయాలన్నారు. ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందిస్తూ పోడు భూముల పట్టాలు అందించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టబోతున్నామన్నారు. మండలాభివృద్ధి కి అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చినట్లు హరీష్‌గౌడ్ చెప్పారు.

పద్మశాలీలు రాజకీయంగా రాణించాలి



మల్లేశ్, భూమన్నను సన్మానిస్తున్న బాపు, నాయకులు

జైపూర్: సామాజిక, ఆర్థికంగా ఎదుగుతున్న పద్మశాలీలు రాజకీయాల్లోనూ రాణించాలని అఖిల భారత పద్మశాలీ సంఘం జిల్లా అధ్యక్షుడు గాదాసు బాపు తెలిపారు. మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన మండల స్థాయి సమావేశంలో నూతన మండల కమిటీ ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ఆయా గ్రామాల నుంచి పద్మశాలీలు పాల్గొనగా పద్మశాలీలను ఐక్యం చేస్తూ చురుకుగా వ్యవరిస్తున్న వ్యక్తులకు ప్రాధాన్యమిస్తూ మండల అధ్యక్షుడిగా మరోసారి వేముల మల్లేశ్, ప్రధానకార్యదర్శిగా దుస్స భూమన్న, గౌరవ అధ్యక్షుడిగా కర్నే భూమన్న, ఉపాధ్యక్షులు ఇప్పలపెల్లి బాపు, ఆడిచెర్ల రాజయ్య, బొద్దున శంకర్, గుండు తిరుపతి, కోశాధికారిగా బల్ల రమేశ్, బొద్దున రాజన్న, దుస్స భాస్కర్, గుండు రాజేశ్, కర్నే మల్లేశ్, ఆవిడపు గణేశ్‌లను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో పద్మశాలీ సంఘం నస్పూర్ అధ్యక్షుడు నాగరాజు, మాజీ సర్పంచ్ ఆవిడపు గణేశ్, తదితరులు పాల్గొన్నారు.

'వారసత్వ భూమి పట్టా కాకుండా ఆపాలి'

మంచిర్యాలఅగ్రికల్చర్: తన తండ్రి తాళ్లపల్లి పోచయ్యకు చెందిన వారసత్వ భూమి పట్టా కాకుండా ఆపాలని రామయ్య దంపతులు శనివారం కలెక్టర్ కుమార్‌దీపక్‌కు వినతిపత్రం అందజేశారు. బాధితుడు రామయ్య మాట్లాడుతూ.. కన్నెపల్లి మండలంలోని జజ్జరవెల్లికి చెందిన తాళ్లపల్లి పోచయ్యకు జజ్జరవెల్లి గ్రామ పంచాయతీ పరిధిలో సర్వే నంబర్లు 1/1ఎ, 10, 43/2, 145, 198, 264, 209, 200, 179, 170, 115, 141, 165, 162,132 గల సర్వేనంబర్లలో 75ఎకరాల వరకు పట్టాభూమి ఉంది. పోచయ్యకు నలుగురు సంతానం కాగా, తనకు ఎలాంటి సమాచారం, నోటీస్ ఇవ్వకుండా శుక్రవారం జజ్జరవెల్లి గ్రామ పంచాయతీలో తన అన్నదమ్ములైన నానయ్య, శంకర్, లింగయ్య వారసులకు పంపకాలు చేయాలని బెల్లంపల్లి ఆర్డీవో, కన్నెపల్లి తహసీల్దార్లు గ్రామ పంచాయతీలో తీర్మానం చేసి అన్యాయం చేశారని వాపోయాడు. తప్పుడు పత్రాలతో ఏకపక్షంగా వ్యవహరించిన అధికారులపై తగు చర్యలు తీసుకొని, తమకు న్యాయం చేయాలని ఫిర్యాదులో పేర్కొన్నాడు.

గ్రీన్ ఇండియా మిషన్



మొక్కలతో శ్రీచైతన్య విద్యార్థులు

మంచిర్యాలఅర్బన్: స్థానిక లక్ష్మీనగర్ శ్రీ చైతన్య పాఠశాలలో శనివారం స్మార్ట్ లివింగ్ కార్యక్రమంలో భాగంగా గ్రీన్ ఇండియా మిషన్ కార్యక్రమం నిర్వహించారు. డివిజనల్ మేనేజర్ సదాశివరెడ్డి, అసిస్టెంట్ మేనేజర్ అరవిందరెడ్డి, అకాడమిక్ కో-ఆర్డినేటర్ నాగరాజు హాజరయ్యారు. మొక్కలు నాటారు. ప్రిన్సిపాల్ అయూబ్, డీన్‌శ్యాం, ఇన్‌చార్జి అనగమాత, పీఈటీ కిషన్ పాల్గొన్నారు.

పరామర్శ

చెన్నూర్: చెన్నూర్ మండలం కిష్టపేట గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గజ్జెల అంకగౌడ్ అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న రాష్ట్ర కార్మిక, మైనింగ్ శాఖ మంత్రి గడ్డం వివేక్‌వెంకటస్వామి శనివారం పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

ఆర్వోప్లాంటు అందజేత

దండేపల్లి: మండలంలోని తాళ్లపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2005-06 సంవత్సరంలో ఎస్సెస్సీ చదివిన విద్యార్థులు ఆ పాఠశాలకు రూ.65వేల విలువ చేసే ఆర్వో ప్లాంటును శనివారం అందించారు. విద్యార్థులకు శుద్ధజలం అందించాలనే సదుద్దేశంతో ఆర్వోప్లాంటును అందించినట్లు పూర్వ విద్యార్థులు తెలిపారు.

పూర్వ విద్యార్థుల చేయూత

మంచిర్యాలరూరల్ (హాజీపూర్): హాజీపూర్ మండలం దొనబండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1991-92 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి విద్యార్థులు శనివారం ఆ పాఠశాలకు రూ.20వేల విలువ గల 20కుర్చీలను విరాళంగా అందజేశారు.

యూరియా పక్కదారి పట్టిస్తే చర్యలు

- ఎరువుల దుకాణాలు తనిఖీ చేసిన అధికారులు



బెల్లంపల్లి: స్టాక్ వివరాలు పరిశీలిస్తున్న అధికారులు

బెల్లంపల్లి: ఎరువుల డీలర్లు యూరియాను పక్కదారి పట్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని బెల్లంపల్లి వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో సీ.హెచ్.శ్రీనివాసరావు హెచ్చరించారు. శనివారం తహసీల్దార్ కృష్ణ, ఎస్‌హెచ్‌వో శ్రీనివాసరావు, వ్యవసాయ అధికారి ప్రేమ్‌కుమార్‌లతో కూడిన మండల టాస్క్‌ఫోర్స్ టీమ్ బెల్లంపల్లిలో ఎరువుల దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. కాంటా చౌరస్తా ప్రాంతంలో ఉన్న ఎరువుల షాపులు, గోదాంలకు వెళ్లి నిశితంగా తనిఖీ చేశారు. రిజిష్టర్‌లో నమోదు చేసిన యూరియా స్టాక్ వివరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్‌హెచ్‌వో మాట్లాడుతూ... రైతులు కాని వారికి వ్యాపారులు ఎరువులు అమ్మవద్దని, వ్యవసాయేతర పనులకు అమ్మితే డీలర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. అధిక ధరకు విక్రయించొద్దని, అమ్మకాలు చేసిన సరుకులకు తప్పనిసరిగా రశీదు ఇవ్వాలని పేర్కొన్నారు. బ్లాక్ మార్కెటింగ్‌కు పాల్పడే డీలర్ల లైసెన్స్‌లు రద్దు చేస్తామని మండల వ్యవసాయ అధికారి ప్రేమ్‌కుమార్ తెలిపారు. కృత్రిమ కొరత సృష్టిస్తే ఊరుకునే ప్రసక్తే లేదని తహసీల్దార్ కృష్ణ స్పష్టం చేశారు.

చెన్నూర్‌రూరల్: మండలంలోని అంగ్రాజ్‌పల్లి, కొమ్మెర, ఆస్నాద గ్రామాల్లోని ఫెర్టిలైజర్ దుకాణాలను టాస్క్‌ఫోర్స్ టీం, రెవెన్యూ, వ్యవసాయశాఖ, పోలీసులు శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. దుకాణాల్లో బిల్లు బుక్స్, స్టాక్ బోర్డు, స్టాక్ రిజిస్టర్, ఫిజికల్ స్టాక్‌ను తనిఖీ చేశారు. ఎరువులు అధిక ధరలకు విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. యూరియా కొరత లేదని, రైతులు ప్రస్తుతం వేసే ఎరువులు మాత్రమే తీసుకెళ్లాలని, తర్వాత దఫా వేసే ఎరువులు ఇప్పుడే తీసుకెళ్లి నిలువ పెట్టుకోవద్దని సూచించారు. తహసీల్దార్ మల్లికార్జున్, సీఐ దేవేందర్‌రావు, ఎస్సై సుబ్బారావు, ఏవో యామిని పాల్గొన్నారు.

నస్పూర్: పట్టణ పరిధిలోని ఫెర్టిలైజర్ దుకాణాదారులు, ఇతరులు ఎవరైనా యూరియా, ఇతర ఎరువులు కృత్రిమ కొరత సృష్టిస్తే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయాధికారి మహేందర్ అన్నారు. రెవెన్యూ, పోలీస్ అధికారులతో కలిసి శనివారం ఆయన పట్టణంలోని ఫెర్టిలైజర్ దుకాణాలను, రైస్ మిల్లుల గోదాములను తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఏఎస్సై బషీర్, ఏఈవో తిరుపతి, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

భీమిని: యూరియాను అధిక ధరలకు అమ్మితే చర్యలు తీసుకుంటామని ఏవో యమునాదుర్గా అన్నారు. మండలంలోని కేస్లాపూర్‌లో హాకా (హైదరాబాద్ అగ్రికల్చరల్ కో-ఆపరేటివ్ అసోసియేషన్) సెంటర్‌ను శనివారం మండల టాస్క్‌ఫోర్స్ టీం తహసీల్దార్ బికార్ణదాస్, ఏవో యమునాదుర్గా, ఎస్సై విజయ్‌కుమార్ సంయుక్తంగా తనిఖీ చేపట్టారు. షాపుల్లోని స్టాక్‌ను, రికార్డులను పరిశీలించారు.



చెన్నూర్‌రూరల్: రిజిస్టర్ పరిశీలిస్తున్న అధికారులు



సీసీసీలోని రైస్‌మిల్లు గోదాము తనిఖీ



భీమిని: కేస్లాపూర్‌లో హాకా సెంటర్ తనిఖీ